క్లుప్తంగా

ఉపాధి కూలీలకు కనీస వేతనం వచ్చేలా చూడాలి



మట్టి ఎత్తుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

ఓర్వకల్లు: జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు కనీస వేతనం వచ్చేలా చూడాలని ఎంపీడీఓ శ్రీనివాసులు ఆదేశించారు. బుధవారం మండలంలోని నన్నూరు, పూడిచెర్ల గ్రామాలలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. కూలీలు కనీసం వేతనం పొందేలా పనులు కల్పించాలని సూచించారు. మస్టర్లను తనిఖీ చేశారు. మస్టర్లలో అవకతవకలకు తావులేకుండా చూడాలన్నారు. గ్రామీణ ఉపాధి పథకం కింద గ్రామ పంచాయతీకి మంజూరైన పనులను చేపట్టి, కుటుంబంలో పనిదినాలను పూర్తి చేయాలన్నారు.

అడిగిన వారందరికీ పనులు కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ నాగేశేషాచల రెడ్డి

కల్లూరు: అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ నాగేశేషాచల రెడ్డి ఆదేశించారు. జాతీయ ఉపాధి హామీ పథకం పనులపై బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఏర్పాటు కానున్న శ్రమశక్తి సంఘాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన టార్గెట్లను ప్రతి టెక్నికల్ అసిస్టెంట్ సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ మద్దేశ్వరమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందనలు



విద్యార్థులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు: జెఈఈ మెయిన్స్ మొదటి విడత ఫలితాలలో చిన్నటేకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఐఐటీ, మెడికల్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చాటారు. అకాడమీకి చెందిన ఏడు గురు విద్యార్థులు 90 శాతంపైగా పర్సంటైల్ సాధించారు. ఈ సందర్భంగా బుధవారం సాంఘిక సంక్షేమ గురుకుల జిల్లా కో ఆర్డినేటర్ శ్రీదేవి, విద్యార్థులు, అధ్యాపకులు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డిని ఆమె క్యాంపు కార్యాలయంలో కలిశారు. విద్యార్థులను ఎమ్మెల్యే శాలువాతో సత్కరించి ప్రత్యేకంగా అభినందించారు. అలాగే మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ ఆయన కార్యాలయంలో విద్యార్థులను అభినందించి, వారికి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు గౌరు వెంకటరెడ్డి, అకాడమీ డైరెక్టర్ ఉమామహేశ్వరప్ప, అధ్యాపకులు పాల్గొన్నారు.

14న బహిరంగ వేలం

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వ్యాపారాలు నిర్వహించుకునేందుకు ఈనెల 14న బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఈఓ రామకృష్ణ బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో టెంకాయలు, పూలు, గాజులు, దేవుళ్ల ఫొటోలు విక్రయించుకునేందుకు వేలం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గలవారు టెంకాయల అంగళ్లకు రూ.లక్ష, మిగితావాటికి రూ.10వేలు చొప్పున ధరవాత్తు చెల్లించి పాటలో పాల్గొనాలన్నారు.

సస్యరక్షణతో చీడపీడల నివారణ



బురాన్‌దొడ్డిలో రైతులకు సస్యరక్షణ చర్యలను వివరిస్తున్న ఏఈఓ హిమబిందు

సి.బెళగల్: రైతులు వ్యవసాయంలో సస్యరక్షణ పద్ధతులను పాటించి పంటలను చీడపీడల నుంచి రక్షణ కల్పించుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారిణి (ఏఈఓ) హిమబిందు అన్నారు. బుధవారం వ్యవసాయ సిబ్బందితో కలిసి మండలంలోని బురాన్‌దొడ్డి, గొల్లలదొడ్డి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామ సచివాలయాల్లో రైతులతో సమావేశమయ్యారు. వ్యవసాయంలో అనుసరించాల్సిన సంరక్షణ, ఆధునిక వ్యవసాయం, వ్యవసాయ యాంత్రీకరణ పద్ధతులను వివరించారు. చీడ పురుగుల ఉధృతిని తెలుసుకునేందుకు లింగార్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని, పంటలు వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని వ్యవసాయ పొలాలను సందర్శించి పంట సాగు సమాచారం, సంరక్షణకు సూచనలను అందజేశారు.

యూరియా.. స్టాకు లేదయ్యా!

- రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులోలేని యూరియా
- బ్లాక్ మార్కెట్‌లో రూ.350కి పైగానే విక్రయిస్తున్న దళారులు
- యూరియా కొరతతో పంటలకు సరైన సమయంలో అందించలేకపోతున్న రైతులు



యూరియా బస్తాలు

పాణ్యం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వ్యవసాయరంగం కుదేలవుతోంది. రైతులకు ఇవ్వాల్సిన రాయితీలు ఇవ్వకపోగా, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కూడా లభించకపోవడంతో అరకొర ధరలకు అమ్ముకుంటూ నష్టాలపాలవుతున్నారు. దీనికితోడు అన్నదాతకు యూరియా అందిచడంలోనూ ప్రభుత్వం విఫలమవుతోంది. మార్కెట్‌లో యూరియా కొరత ఉండటంతో బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరకు విక్రయిస్తున్నారు. పైగా రైతులు రాత్రింబవళ్లు షాప్‌ల వద్ద, రైతు సేవా కేంద్రాల ఎదురు చూడాల్సి వస్తోంది.

15వేల ఎకరాల్లో పంటల సాగు..

పాణ్యం మండలంలో దాదాపు 15 వేలకుపైగా ఎకరాల్లో రబీలో పంటలు సాగు చేశారు. ఆయకట్టు కింద పాణ్యం,కొండజుటూరు, గోరుకల్లు, ఆలమూరు, కొణిదేడు గ్రామాల్లో సుమారు 10వేల ఎకరాల్లో వరిని సా గు చేస్తున్నారు. ఎకరానికి కనీసం 5 బస్తాలైన యూరి యాను వేయాల్సి ఉంటుంది. మార్కెట్‌లో కొరత వలన రైతులు సకాలంలో పంటలకు అందించలేకపోతున్నారు.

బ్లాక్‌లో బస్తా రూ. 350పైనే..

సాధారణంగా మార్కెట్‌లో యూరియా బస్తా రూ.266 ధర ఉంది. ప్రస్తుతం యూరియా సరఫరా లేనందున దళారులు బ్లాక్‌లో బస్తా రూ.350పైనే విక్రయిస్తున్నారు. అది కూడా గోప్యంగా. దీంతో సామాన్యులకు యూరియా అందని ద్రాక్షలా మారింది. యూరియా కోసం ఎంత వెతికినా దొరకడం లేదు. మునుపెన్నడూ ఇలాంటి పరిస్థితిని చూడలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక ధరలు, బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించాల్సిన ప్రభుత్వం పట్టించుకోకపోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి లేదు



యూరియా కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకుంటే యూరియా ఇచ్చేవారు. ప్రస్తుతం షాపుల్లో లేదని చెబుతున్నారు. 10 ఎకరాల పైగానే వరి పంటను సాగు చేస్తున్నా. యూరియా కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. ఇలాంటి పరిస్థితి ఎన్నడూ లేదు.

– కంది ఏసురత్నం, కొండజుటూరు

బ్లాక్‌లో కొనాల్సి వస్తోంది



చిన్న రైతులకు యూరియా దొరకడం లేదు. చాలా మంది బ్లాక్‌లో కొంటున్నారు. బ్లాక్‌లో రూ. 350 విక్రయిస్తున్నారు. అది కూడా రహస్యంగా అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం వీటిపై చర్యలు తీసుకొని రైతులందరికీ యురియా అందేలా చూడాలి. బ్లాక్ మార్కెట్‌లో విక్రయించకుండా చర్యలు తీసుకోవాలి.

–రమేష్ కొండజుటూరు

చర్యలు తీసుకుంటాం

ప్రతి రైతు సేవా కేంద్రాల్లో బుకింగ్ చేసుకున్న వారికి యురియాను అందిస్తున్నాం. యూరియా కొరత ఉన్నది వాస్తవం. ఎక్కడైనా బ్లాక్‌లో విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా బ్లాక్‌లో విక్రయిస్తున్నట్లు తెలిస్తే ఫిర్యాదు చేసే వారి పేర్లు గోప్యంగా ఉంచి, దళారులపై చర్యలు తీసుకుంటాం.

–జయప్రకాష్‌రెడ్డి, ఏఓ

శివాలయంలో ప్రత్యేక పూజలు



శివాలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

గడివేముల: స్థానిక శివాలయంలో శివమాలధారులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం మాఘమాస పౌర్ణమి సందర్భంగా రామలింగేశ్వర స్వామికి వేకువ జామునే గణపతి పూజ, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకుడు బ్రహ్మయ్య ఆధ్వర్యంలో హోమంతో పాటు శివ శివార్చన, శివ అష్టోత్తర శతనామావళి, బిల్వార్చన, విశేష పుష్పాలతో అలంకరించారు. రాత్రి చెన్నకేశవ ఆలయ ప్రాంగణంలో మెట్ల పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఘనంగా ఏపీఈఈయూ వార్షికోత్సవం

పాణ్యం : మండల కేంద్రంలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో బుధవారం ఏపీఈఈయూ 75వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యాలయం ఆవరణలో జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో లైన్‌మెన్లు ఈశ్వరయ్య, వెంకటరాముడు, శ్రీను, గోపాల్, షరీఫ్, షేక్షా, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

చౌడేశ్వరీ దేవికి సారె సమర్పణ



ప్రత్యేక అలంకరణలో శ్రీచౌడేశ్వరీదేవి



అమ్మవారికి సారెను సమర్పిస్తున్న డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, సర్పంచ్ భాగ్యరత్న

కోడుమూరు రూరల్: మండలకేంద్రంలో వెలసిన శ్రీచౌడేశ్వరీ దేవి తిరునాల ఉత్సవాలను పురస్కరించుకొని బుధవారం మేజర్ గ్రామ పంచాయతీ తరఫున గ్రామ సర్పంచు భాగ్యరత్న, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అమ్మవారికి సారె సమర్పించారు. అంతకుముందు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి వారు అమ్మవారి దేవాలయం వరకు ఊరేగింపుగా వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాముడు, మాజీ సర్పంచు సీబీ.లత, గ్రామ పెద్దలు హేమాద్రిరెడ్డి, మధుసూదన్ రెడ్డి, ఎద్దుల మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ..

కోడుమూరులో వెలసిన శ్రీచౌడేశ్వరీదేవి తిరునాల సందర్భంగా గురువారం ఉదయం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో అమ్మవారికి సారె సమర్పిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రమేష్‌నాయుడు బుధవారం తెలిపారు. కార్యక్రమానికి కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ ముఖ్య అతిథులుగా విచ్చేస్తారన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

నేడు రథోత్సవం

శ్రీచౌడేశ్వరీ దేవి తిరునాల ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం అమ్మవారి రథోత్సవాన్ని నిర్వహించేందుకు అటగార దేవాంగ దైవచార సంఘం సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు

రీసర్వేను పకడ్బందీగా నిర్వహించండి



రీసర్వే ను పరిశీలిస్తున్న జేసీ నవ్య

కర్నూలు(రూరల్): భూముల రీ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని జేసీ నవ్య ఆదేశించారు. మండల పరిధిలో ఈ.తాండ్రపాడు గ్రామంలో నిర్వహిస్తున్న రీ సర్వేను బుధవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైతుల సహకారంతో ఎలాంటి తప్పులు లేకుండా రీసర్వేను పూర్తిచేయాలన్నారు. రైతుల నుంచి తిరిగి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. జాయింట్ ఎల్.పి. నంబర్లు నమోదు కాకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కిడారి సందీప్ కుమార్, తహసీల్దార్ టీవీ రమేష్ బాబు, మండల సర్వేయర్ సూధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బార్తాల పున్నమి



అమ్మవారి పల్లకోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి జన్మదినం, బార్తాల పున్నమి మహోత్సవాన్ని ఆలయ ఈఓ పి.యన్.రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం వేకువజామున అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమ అర్చన, విశేష పూజలు చేపట్టారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

వెంకాయపల్లె ఎల్లమ్మ అమ్మవారిని బుధవారం కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి పల్లకీ సేవా కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఆకతాయిల ఆగడాలు అరికట్టండి

కర్నూలు(రూరల్) : మండల పరిధిలోని దిన్నేదేవరపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద ఆకతాయిల ఆగడాలను అరికట్టాలని హైస్కూ ల్ హెచ్ఎం మొహమ్మద్ యాసిన్ కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. పాఠశాల కు ప్రహరీ లేనందున నిత్యం ఆకతాయిలు సంచరిస్తూ అసౌకర్యానికి గురిచేస్తున్నారన్నారు. దాదాపుగా రెండు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 204 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. హైస్కూల్ గ్రామానికి దూరంగా ఉండటం, చుట్టూ వెంచర్లు ఖాళీగా ఉండి ముళ్లపొదలు పెరగడంతో మందుబాబులకు ఈ ప్రాంతం అడ్డాగా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని వలన విద్యార్థులకు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమీప వెంచర్ల నుంచి ఆకతాయిలు హైస్కూల్ ఆవరణలో మందు తాగుతూ, సిగరెట్లు కాల్చు తూ, బైక్‌లతో అధిక శబ్దం చేస్తూ, హారన్లు కొడుతుండటం వల్ల విద్యార్థులు చదువు పై దృష్టి పెట్టలేకపోతున్నారని చెప్పారు. ఆకతాయి ల వల్ల విద్యార్థినులకు భద్రత కరువైందని భావించి తల్లిదండ్రులు వారి పిల్లలను ఈ స్కూల్‌లో చేర్పించడానికి ఇష్టపడటం లేదన్నారు. సమస్యను జిల్లా విద్యా శాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

పీజీ సెట్‌ను రద్దు చేయాలి

కర్నూలు కల్చరల్: కామన్‌పీజీ సెట్‌ను వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కన్వీనర్ రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కామన్ పీజీ సెట్ ద్వారా రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో పీజీ ప్రవేశాలు తగ్గిపోయాయన్నారు. పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షను యూనివర్సిటీలకే అప్పజెప్పాలని కోరారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి



విజేతలకు ట్రోఫీని అందిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. కాటసాని రాంభూపాల్‌రెడ్డి తండ్రి కాటసాని నరసింహారెడ్డి జ్ఞాపకార్థం లైట్ టెన్నిస్ బాల్ క్రికెట్ సూపర్-8 టోర్నమెంట్-2025 నిర్వహించారు. టోర్నమెంట్‌లో విజేతలైన వారికి బుధవారం బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కోడుమూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ ఆదిమూలపు సతీష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో కార్పొరేటర్ నారాయణరెడ్డి, నాయకులు సుకుమార్, బెల్లం మహేశ్వర్‌రెడ్డి, భీమశంకర్‌రెడ్డి, విజయమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా రీసర్వే చేయండి



కొర్రపోలూరులో రీసర్వే పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటరమణ

గడివేముల: రైతులకు ఇబ్బంది లేకుండా భూముల రీ సర్వే చేయాలని తహసీల్దార్ వెంకటరమణ సూచించారు. బుధవారం మండల పరిధిలోని కొర్రప్రోలూరు గ్రామంలో రీ సర్వే పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రీ సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. రైతులు తమ వద్ద ఉన్న ఆధారాలను అధికారులకు చూపించి, తమ పొలాల గట్లను చూపిస్తే పనులు త్వరగా పూర్తి చేయవచ్చన్నారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ హరికృష్ణ, మండల సర్వేయర్ మధు, వీఆర్వో అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఓ భాస్కర్

కల్లూరు : గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) భాస్కర్ పంచాయతీ కార్యదర్శులకు, ఈఓ ఆర్డీ నాగేష్‌కు సూచించారు. బుధవారం కల్లూరు మండలం చిన్నటేకూరు, పెద్దటేకూరు, ఉలిందకొండ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో వాటర్ ట్యాంకులను, చెత్త సంపద తయారీ కేంద్రాలను, పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. డీపీఓ మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటా చెత్త సేకరణ చేపట్టి తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయాలన్నారు. వాటర్ ట్యాంక్‌లను ప్రతి 15 రోజులకు ఒకసారి తప్పనిసరిగా శుభ్రం చేయాలన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన ఉండాలి

పాణ్యం : ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఏసీబీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చాంద్‌బాషా అన్నారు. బుధవారం మండలంలోని నెరవాడ మెట్ట వద్ద మహిళలు, విద్యార్థులు, ప్రజలతో విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. మత్తుపదార్థాలు, బెట్టింగ్, జూదానికి యువకులు ఆకర్షితులు కారాదన్నారు. విద్యార్థులు గంజాయి, మాదకద్రవ్యాలు విక్రయించే వారి వివరాలు పోలీసులకు తెలియజేయాలన్నారు.

ఆలయ దుకాణాల స్వాధీనం



ఆలయ దుకాణాలకు సీల్ వేస్తున్న దేవదాయ శాఖ అధికారులు

కర్నూలు కల్చరల్: కల్లూరు మండల పరిధిలో ఆక్రమణలకు గురైన చౌడేశ్వరీ ఆలయానికి చెందిన 14 షాపులను దేవదాయ శాఖ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్ సుధాకర్‌రెడ్డి, ఆలయ ఈఓ గుర్రెడ్డి పోలీసులు, రెవెన్యూ అధికారుల సహకారంతో ఆక్రమణదారులను దుకాణాల్లోంచి బయటికి పంపి తాళాలు వేశారు. ఏసీ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. సుమారు రూ.90 లక్షల ఆలయం వచ్చే దుకాణాలను కొందరు ఆక్రమించుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పోలీస్, రెవెన్యూ, దేవదాయశాఖ ఉద్యోగుల సహకారంతో షాపులను ఖాళీ చేయించి పంచనామా చేయించి సీల్ వేయడం జరిగిందన్నారు. ఈఓలు చంద్రశేఖర్‌రెడ్డి, మద్దిలేటి, సీతారామిరెడ్డి, ఇన్‌స్పెక్టర్ బి.రమేష్, నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సమీర్, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలు ప్రారంభం



స్లోసైకిల్ పోటీల్లో బాలురు



కబడ్డీ పోటీలకు టాస్ వేస్తున్న సీఐ తబ్రేజ్

కోడుమూరు రూరల్: మండల కేంద్రంలో వెలసిన శ్రీచౌడేశ్వరీ దేవి తిరునాలను పురస్కరించుకుని క్రీడల సాంస్కృతిక కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడాపోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన స్లోసైకిల్ పోటీలను డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, గ్రామ సర్పంచు భాగ్యరత్న, చదరంగం పోటీలను ఎస్ఐ శ్రీనివాసులు ప్రారంభించారు. స్లోసైకిల్ పోటీల్లో గూడూరు మండలం చనుగొండ్లకు చెందిన సురేంద్ర, మనోజ్ మొదటి, రెండవ స్థానాల్లో, కోడుమూరుకు చెందిన జాన్‌మోస్ మూడవ స్థానంలో నిలిచారు. చెస్ సీనియర్ విభాగంలో కోడుమూరుకు చెందిన టిప్పు సుల్తాన్, ఆదాం మొదటి, రెండవ స్థానాల్లో నిలువగా, జూనియర్ విభాగంలో స్థానిక బాలుర హైస్కూల్‌కు చెందిన విద్యార్థి హర్షవర్ధన్ మొదటి స్థానంలో, 2వ స్థానంలో క్రీసెంట్ స్కూల్‌కు చెందిన విద్యార్థి భరత్ నిలిచారు. అలాగే స్థానిక సంతమార్కెట్ మైదానంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను కోడుమూరు సీఐ తబ్రేజ్ ప్రారంభించారు. అలాగే విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు.

రైతులందరికీ విశిష్ట గుర్తింపు కార్డు



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏడీఏ సాలురెడ్డి

కోడుమూరు రూరల్ : ప్రభుత్వం పాసు పుస్తకమున్న ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు కార్డును ఇస్తోందని కర్నూలు ఏడీఏ సాలురెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని అమడగుంట్ల, ఎర్రదొడ్డి గ్రామాల్లో ఏఓ రవిప్రకాష్ రైతులతో కలిసి 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. వేరుశనగ సాగుచేసిన పొలాలను సందర్శించి, పలు సూచనలిచ్చారు. ఏడీఏ మాట్లాడుతూ.. రైతులు ఆధార్, పొలం పాసుపుస్తకాలతో ఆయా రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. అలాగే కందులను మద్దతు ధరపై ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని, కంది రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కౌలు రైతుల రక్షణకు సమగ్ర చట్టం చేయాలి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసులు

కల్లూరు: కౌలు రైతుల రక్షణ కోసం ప్రభుత్వాలు సమగ్ర చట్టం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం కల్లూరు తహసీల్దార్ కార్యాలయంలో కౌలు రైతుల సమస్యలపై తహసీల్దార్ ఆంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ కౌలు రైతులకు పంట రుణాలు, పెట్టుబడి సాయం, పంటల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. దేవదాయ ధర్మదాయ, వక్ఫ్ భూములను సాగు చేసుకుంటున్న కౌలు రైతులందరికీ వ్యవసాయ, ఉద్యాన పథకాలను బ్యాంక్‌లు పంట రుణాలు, ఇతర పథకాలు వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో భీముడు, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేమన పద్యాల్లో మానవీయ విలువలు



పోలకల్ జెడ్పీహైస్కూల్లో విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న హెచ్ఎం రమ

సి.బెళగల్: మహాకవి యోగి వేమన రచించిన పద్యాలు మానవీయ విలువలను పెంపొందిస్తాయని పోలకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం రమ అన్నారు. వేమన జయంతిని పురస్కరించుకుని వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు వేమన పద్యాలపై పోటీలను నిర్వహించారు. పోటీలలో ఆదిత్య 62 పద్యాలతో మొదటి బహుమతి, 53 పద్యాలతో కళావతి రెండవ బహుమతి, 52 పద్యాలతో ఉషారాణి మూడవ బహుమతి పొందారు. వీరితో పాటు పోటీలలో పాల్గొన్న మరో ఏడుగురు విద్యార్థినులకు మెడల్స్, ప్రశంసా పత్రాలను, వేమన పుస్తకాలను బహుమతిగా అందజేశారు. వేమన ఫౌండేషన్ అధ్యక్షుడు ఆచార్య కాడా రామకృష్ణారెడ్డి, కార్యదర్శులు డాక్టర్ అప్పిరెడ్డి, హరినాథరెడ్డిలకు పాఠశాల బృందం ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అయ్యస్వామి, నాగిరెడ్డి, రమణయ్య, విజయకుమారి, దుర్గమ్మ, శ్రీదేవి తదితరులు ఉన్నారు.